TG TEL/25/A1234

www.kakatiyanews.com

# ఉత్తరం కాకతీయ

ఆదివారం, 23 ఆగస్టు 2026 | సంపుటి: 02 సంచిక: 10 | పేజీలు: 6 వెల: 5


## స్థానిక ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం

- కమ్యూనిటీ, ఏరియా, జిల్లా ఆస్పత్రులను బలోపేతం చేయాలి
- అవసరమైతేనే పేషెంట్లను రిఫర్ చేయాలి
- అవసరమైన చోట కొత్త సీటీ స్కాన్లు
- వారానికి ఒకరోజు ఆకస్మిక తనిఖీలు తప్పనిసరి
- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ




3

## ఫీజు రీయింబర్స్‌మెంట్ లెక్క తేలేదెప్పుడు?

### ఏళ్లుగా పేరుకుపోయిన బకాయిలు

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులపై ప్రభావం
- 2020-21 నుంచి 2024-25 వరకు బకాయిలపై కోర్టుకెక్కిన కాలేజీలు
- ప్రభుత్వం చెల్లించింది ఎంత? ఇంకా ఇవ్వాల్సింది ఎంత?
- రూ.15 వేల కోట్లంటున్న బీజేపీ.. ప్రభుత్వ లెక్కలు ఏం చెబుతున్నాయి?
- లెక్క తేలితేనే అసలు బకాయిలు గుట్టు బయట పడేది..!




**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వ్యవహారం తెలంగాణలో మరోసారి రాజకీయంగా వేడెక్కింది. రూ.15 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని బీజేపీ ఆరోపిస్తుండగా.. అసలు బకాయి ఎంత? ఏ విద్యా సంవత్సరానికి ఎంత?

........(తరువాయి 2లో)

## ఫీజు బకాయి.. బీజేపీ లడాయి!

- విద్యార్థుల సమస్యలపై 48 గంటల మహాదీక్ష
- రూ.15వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి
- ఈ నెల 24, 25 తేదీల్లో నాంపల్లి బీజేపీ కార్యాలయం వద్ద ఆందోళన
- విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

2

### సురేఖపై చర్యలకు జాతీయ నాయకత్వం బ్రేకులు

- కట్టలు తెంచుకున్న ఆగ్రహానికి అగ్రనాయకత్వం కట్టడి
- సీఎం వచ్చాకే మాట్లాడుతానన్న సురేఖ వ్యాఖ్యల వెనుక అంతరార్థం అదేనా..?
- కొండా ఫ్యామిలీకి నేరుగా సోనియాగాంధీ నుంచి సపోర్ట్
- అందుకే మల్లు రవి స్వరం మారిపోయిందా..?!
- బీసీ మహిళా మంత్రిపై అందరూ మాట్లాడటమేంటని అధిష్ఠానం ఆరా!
- సీఎం రేవంత్‌రెడ్డి కోటరీలో రాజకీయ కలకలం!!



# సీన్ రివర్స్!

## సీఎం అనుకున్నది కావడం లేదా..?

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మిత చేసిన వ్యాఖ్యలతో మొదలైన వివాదం అనూహ్య మలుపు తిరిగిందా? కొండా సురేఖపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం వర్గం నుంచి వచ్చిన డిమాండ్లకు జాతీయ నాయకత్వం బ్రేకులు వేసిందా? వ్యవహారం ఢిల్లీ పెద్దల దృష్టికి వెళ్లడంతో పరిస్థితిని చల్లబరిచే ప్రయత్నాలు మొదలయ్యాయా? అన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. తొలుత సురేఖపై చర్యలు తప్పవన్న స్థాయిలో సాగిన చర్చ.. ఇప్పుడు అధిష్ఠానం జోక్యంతో వెనక్కి తగ్గినట్లు కనిపించడం రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. అంతేకాదు.. ''సీఎం వచ్చాకే మాట్లాడుతా'' అని కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కూడా ఈ పరిణామాలకు సంకేతమేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



**చర్యలకు బ్రేకులెందుకు?**

సుష్మిత వ్యాఖ్యలపై

........(తరువాయి 2లో)

### సురేఖపై మరోసారి చర్చిస్తాం!

- సుస్మిత వ్యాఖ్యల వీడియోలను క్షుణ్ణంగా పరిశీలించాం
- సురేఖ వివరణ అందింది.. మరింత చర్చించిన తర్వాతే నిర్ణయం
- కొందరు ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేస్తామన్నారు
- పార్టీ లైన్ దాటితే ఎవరిపైనైనా చర్యలు ఉంటాయి
- టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి

2



### మాపై వ్యాఖ్యల వెనుక ‘అదృశ్య హస్తం’!

- మా కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని సమన్వయంతో వ్యాఖ్యలు
- క్రమశిక్షణ కమిటీ విచారణను ప్రభావితం చేసే ప్రయత్నాలు
- నోటీసుకు ఇప్పటికే వివరణ ఇచ్చా.. ఉపసంహరించుకోవాలి
- టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవికి మంత్రి కొండా సురేఖ లేఖ

2

## రూ.7 వేల కోట్లతో ఎల్పీజీ పైప్‌లైన్లు!

- 1,800 కి.మీ. మేర మూడు కొత్త మార్గాలకు పీఎన్‌జీఆర్‌బీ ఆమోదం
- తెలంగాణ సహా ఆరు రాష్ట్రాలకు విస్తరించనున్న నెట్‌వర్క్
- రోడ్డు రవాణా తగ్గించి.. సురక్షిత, చౌకైన సరఫరాకు ప్రాధాన్యం
- గెయిల్ ఆధ్వర్యంలో నిర్మాణం.. 9,500 కి.మీ.కు చేరనున్న పైప్‌లైన్ నెట్‌వర్క్




3




## భూభారతి పేరుతో భూదందా!

### లక్షలాది ఎకరాలను 22ఏ జాబితాలో చేర్చారు

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో భూదందాలు, సెటిల్‌మెంట్ల రాజ్యం నడుస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆరోపించారు. ‘భూభారతి’ పేరుతో ప్రైవేటు భూములను సైతం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి సెటిల్‌మెంట్లకు తెరతీశారని విమర్శించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే సుమారు నాలుగు లక్షల ఎకరాల భూములను 22ఏలో చేర్చినట్లు ఆరోపిస్తూ.. గత రెండుమూడేళ్లలో నిషేధిత జాబితాలో చేర్చిన, తొలగించిన భూములపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా మున్సిపల్ అనుమతులు పొంది, పన్నులు చెల్లిస్తూ నివాసముంటున్న ప్రైవేటు ఇళ్లు, స్థలాలను సైతం 22ఏలో చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. సెటిల్‌మెంట్ల పేరుతో 50 శాతం వాటాలు, భారీగా

........(తరువాయి 2లో)

- 50 శాతం వాటాలు, భారీగా లంచాల డిమాండ్
- రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి
- సెప్టెంబర్ 17న హైదరాబాద్ విమోచన దినోత్సవం
- కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి

## హైదరాబాద్‌లో లండన్ యూనివర్సిటీ క్యాంపస్!

- క్యాంపస్ ఏర్పాటుకు లండన్ యూనివర్సిటీ ప్రతినిధుల కసరత్తు
- విస్తృత విద్యా కోర్సులు, కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళిక
- ఎల్ఎస్ఈ, ఎస్ఓఏఎస్ ప్రతినిధులతో తెలంగాణ రైజింగ్ బృందం భేటీ
- సీఎం ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో లండన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం

3



## వందేమాతరంపై రాజీ వద్దు!

- రాజ్యాంగం, పార్లమెంట్ కంటే ఎవరూ గొప్ప కాదు..
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్
- రెండు చరణాలకే పరిమితం చేయడాన్ని తీవ్రంగా ఖండించిన బీజేపీ
- వందేమాతరం చరిత్ర, వారసత్వంపై దేశవ్యాప్త ప్రచారం



2

## కొండాయిగూడెం ర్యాంప్‌లో ఓవర్‌లోడింగ్!

- 49.5 టన్నుల పరిమితి.. 57 టన్నుల వరకు ఇసుక రవాణా?
- గురువారం రోజంతా ఓవర్‌లోడ్ లారీలే..
- విషయం బయటకు రాగానే ఎస్ఆర్‌పీ బదిలీ?
- లారీకి రూ.2,300 వసూలు.. ఓవర్‌లోడ్‌కు అదనపు వసూళ్లు?
- శ్రీకర్ కనుసన్నల్లోనే వ్యవహారమా?.. అధికారుల చర్యలపై ప్రశ్నలు



3



## డార్క్‌స్టోర్లపై టీజీసేఫ్ మెరుపుదాడులు!

- 20 స్టోర్లలో ఆకస్మిక తనిఖీలు.. భారీగా ఆహార పదార్థాల స్వాధీనం
- దుమ్ము, ధూళి మధ్యే సరుకుల నిల్వ.. పరిశుభ్రతకు పాతర
- గడువు ముగిసిన ప్యాకేజ్డ్ ఫుడ్ కూడా వినియోగదారులకే?
- ల్యాబ్ నివేదికల తర్వాత కఠిన చర్యలు : టీజీ-సేఫ్ అధికారులు

**కాకతీయ, హైదరాబాద్ :** క్విక్ కామర్స్ సంస్థల డార్క్‌స్టోర్లలో ఆహార భద్రత ప్రమాణాలపై తెలంగాణ ఫుడ్ సేఫ్టీ అధికారులు కొరడా ఝుళిపించారు. వినియోగదారులకు నిమిషాల వ్యవధిలో సరుకులు చేరవేస్తున్న డార్క్‌స్టోర్లలో ఆహార పదార్థాల నిల్వ, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు ఎలా ఉన్నాయో తేల్చేందుకు టీజీసేఫ్ అధికారులు నగరంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. టీజీసేఫ్ కమిషనర్ ఆదేశాలతో 10 ప్రత్యేక బృందాలు, స్థానిక పోలీసుల సహకారంతో దాదాపు 20 డార్క్‌స్టోర్లలో ఏకకాలంలో తనిఖీలు చేపట్టాయి. తనిఖీల్లో భారీగా ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు.. అనుమానం ఉన్న ఉత్పత్తుల నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. తనిఖీల సందర్భంగా పలు డార్క్‌స్టోర్లలో కనీస పరిశుభ్రత ప్రమాణాలు పాటించడం లేదని అధికారులు గుర్తించినట్లు తెలిపారు. దుమ్ము, ధూళితో కూడిన వాతావరణంలో ఆహార పదార్థాలను నిల్వ ఉంచినట్లు వెల్లడైంది. వినియోగదారులకు పంపించే ముందు ఉత్పత్తుల నాణ్యత, నిల్వ పరిస్థితులను పరిశీలించడంలో నిర్లక్ష్యం కనిపించినట్లు అధికారులు పేర్కొన్నారు.

........(తరువాయి 2లో)

# భూభారతి పేరుతో భూదందా!

**(మొదటిపేజీ తరువాయి)**

లంచాలు డిమాండ్ చేస్తున్నారన్నారు. ప్రభుత్వ, దేవాదాయ భూములకు మాత్రమే వర్తించాల్సిన 22ఏ జాబితాలో ప్రైవేటు ఆస్తులను చేర్చడంపై సమగ్ర విచారణ అవసరమన్నారు. హైడ్రా వ్యవహారంలోనూ పేదలకు ఒక న్యాయం, మజ్లిస్, కాంగ్రెస్ నేతలకు మరో న్యాయం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజల ఆస్తులు భద్రంగా ఉండాలంటే ఆర్మీని దింపాల్సిన పరిస్థితి వచ్చిందంటూ హైకోర్టు వ్యాఖ్యానించిందని గుర్తుచేశారు. భూ బాధితులకు మండల స్థాయి నుంచి హైకోర్టు వరకు బీజేపీ లీగల్ సెల్ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు.

**రేషన్ బియ్యంపై కేంద్ర లోగో ఏదీ?**

ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద కేంద్ర ప్రభుత్వం 70 శాతానికి పైగా సబ్సిడీ భరిస్తూ పేదలకు ఐదు కిలోల ఉచిత బియ్యం అందిస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ లోగోతో పంపిణీ జరుగుతుండగా.. తెలంగాణలో మాత్రం ప్రధాని నరేంద్ర మోదీ పేరు, భారత ప్రభుత్వ లోగో లేకుండా ముఖ్యమంత్రి, పౌరసరఫరాల మంత్రి ఫొటోలు మాత్రమే ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. కేంద్రం అందిస్తున్న పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తన పథకంగా ప్రచారం చేసుకోవడం మానుకోవాలని సూచించారు. లేకపోతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా లబ్ధిదారులకు బియ్యం అందించే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో కాలేజీలకు చెల్లించాల్సిన సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిధులు లేక ఇంజనీరింగ్ కాలేజీలు మూతపడుతున్నాయని, విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

**ఓటర్ల జాబితా శుద్ధి చట్టబద్ధ ప్రక్రియ**

ఓటర్ల జాబితా శుద్ధి కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న చట్టబద్ధ ప్రక్రియ అని కిషన్‌రెడ్డి తెలిపారు. 'ఒక వ్యక్తి.. ఒకే ఓటు' విధానంలో భాగంగా డబుల్ ఓట్లు, మరణించిన వారి ఓట్లను తొలగిస్తున్నారని చెప్పారు. ఈ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, బీఎల్వోలు పనిచేస్తున్నప్పటికీ కేంద్రంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. హైదరాబాద్‌లో గ్రామీణ ఓట్లను తగ్గించి మజ్లిస్‌కు లబ్ధి చేకూర్చేందుకే సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను భయపెట్టారని ఆయన ఆరోపించారు. గ్రామంలో ఓటు నమోదు చేసుకోకపోతే రేషన్ కార్డులు, భూములు, ఆస్తులు, పెన్షన్లు పోతాయని సీఎం చేసిన ప్రకటనలతో ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో 9.35 లక్షల ఓట్లు తగ్గాయని పేర్కొన్నారు.

**విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తాం**

రజాకార్ల అరాచకాలకు, నిజాం నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా కలంతో పోరాడిన 'ఇమ్రోజ్' పత్రిక ఎడిటర్ షోయబుల్లా ఖాన్ వర్ధంతి సందర్భంగా కిషన్‌రెడ్డి నివాళులర్పించారు. త్రివర్ణ పతాకం ఎగరాలని, అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావాలని కోరినందుకు రజాకార్లు ఆయనను 1948 ఆగస్టు 21న కాచిగూడ లింగంపల్లి చౌరస్తాలో హత్య చేశారని గుర్తుచేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 'హైదరాబాద్ విమోచన దినోత్సవం' నిర్వహించనున్నట్లు తెలిపారు. పారామిలిటరీ కవాతు, తెలంగాణ కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో వేడుకలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. మహారాష్ట్ర, కర్ణాటకల్లో దశాబ్దాలుగా అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికీ.. తెలంగాణలో గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు మజ్లిస్ భయంతో, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం నిర్వహించడం లేదని విమర్శించారు. విదేశీ పర్యటనల అనుమతుల విషయంలో రాజకీయ కక్షసాధింపులు లేవని, దౌత్య నిబంధనలు, భద్రతా ప్రోటోకాల్స్ ప్రకారమే కేంద్ర విదేశాంగ శాఖ నిర్ణయాలు తీసుకుంటుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలోనూ బీజేపీ మంత్రుల విదేశీ పర్యటనలకు అనుమతులు రాని సందర్భాలున్నాయని తెలిపారు. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో 369 మంది విద్యార్థులను కాల్చి చంపిన చరిత్ర కాంగ్రెస్‌దేనని విమర్శించారు. పార్లమెంట్ వద్ద ఆందోళనల విషయంలో రాహుల్‌గాంధీ బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా వ్యవహరించాలని సూచించారు.

# ఫీజు బకాయి.. బీజేపీ లడాయి!


- విద్యార్థుల సమస్యలపై 48 గంటల మహాదీక్ష
- రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్
- ఈ నెల 24, 25 తేదీల్లో నాంపల్లి బీజేపీ కార్యాలయం వద్ద ఆందోళన
- విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ 48 గంటల మహాదీక్షకు సిద్ధమైంది. 'ఫీజు బకాయి-బీజేపీ లడాయి' పేరుతో ఈ నెల 24, 25 తేదీల్లో నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట దీక్ష నిర్వహించనున్నట్లు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఫీజులు చెల్లించకపోవడంతో కొన్ని కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, విద్యార్థులు పైచదువులు, ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని అన్నారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. బకాయిలు చెల్లించే వరకు పోరాటం కొనసాగుతుందని, మహాదీక్షలో విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు ఇవ్వాలని మహేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ లెక్క తేలేదెప్పుడు?

**(మొదటిపేజీ తరువాయి)**




ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులకు సంబంధించి ఎంత పెండింగ్‌లో ఉంది? ఇప్పటికే ప్రభుత్వం ఎంత చెల్లించింది? ఇంకా ఎంత ఇవ్వాల్సి ఉంది? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. 2020-21 నుంచి 2024-25 వరకు తమకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేదంటూ ప్రైవేట్ ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర కాలేజీలు హైకోర్టును ఆశ్రయించడంతో సమస్య మరింత తీవ్రతరమైంది. బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.15 వేల కోట్లకు చేరాయని ఆరోపిస్తోంది. ఈ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 'ఫీజు బకాయి-బీజేపీ లడాయి' పేరుతో ఆందోళనలకు పిలుపునిచ్చింది. అయితే రూ.15 వేల కోట్లు ప్రస్తుతం బీజేపీ పేర్కొంటున్న మొత్తమే తప్ప.. ప్రభుత్వం ప్రకటించిన తుది సమగ్ర లెక్కగా చెప్పడానికి అధికారిక కేటగిరీ వారీ వివరాలు అందుబాటులో లేవు. మరోవైపు హైకోర్టును ఆశ్రయించిన 89కిపైగా పిటిషన్లలో 2020-21 నుంచి 2024-25 వరకు బకాయిలు చెల్లించలేదని కాలేజీలు పేర్కొన్నాయి.

**ఏళ్ల బకాయిలు.. కొత్త విధానం**

ఫీజు రీయింబర్స్‌మెంట్ వివిధ సంక్షేమ శాఖల ద్వారా అమలవుతోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులకు పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్, ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ప్రయోజనాలు అందుతున్నాయి. 2026 ఏప్రిల్‌లో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో 2025-26 వరకు ఉన్న పాత బకాయిలను పాత విధానంలోనే పరిష్కరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. 2026-27 నుంచి కొత్త డీబీటీ విధానం అమల్లోకి వస్తుందని తెలిపింది. అంటే కొత్త విధానం అమల్లోకి వచ్చినా పాత బకాయిల బాధ్యత మాత్రం ప్రభుత్వంపై కొనసాగుతుంది. ఇదే ఇప్పుడు తేలాల్సిన అసలు లెక్క. 2025లో ప్రొఫెషనల్ కాలేజీల సంఘాలు సుమారు రూ.1,650 కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరాయి. 2026లో హైకోర్టు విచారణ సందర్భంగా కాలేజీల తరఫున బకాయిలు దాదాపు రూ.10 వేల కోట్లకు చేరాయని వాదించారు. మరోవైపు ప్రభుత్వం దశలవారీగా చెల్లింపులు చేస్తామని కోర్టుకు హామీ ఇచ్చింది. అందువల్ల రూ.15 వేల కోట్ల బకాయిలు అన్న ఆరోపణకు పూర్తి చిత్రాన్ని ఇవ్వాలంటే ప్రభుత్వం శాఖల వారీగా, సంవత్సరాల వారీగా తాజా లెక్కలను విడుదల చేయాల్సిన అవసరం ఉంది.

**ఫీజు బకాయి.. సర్టిఫికెట్లకు బ్రేక్!**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల ప్రభావం ఇప్పుడు విద్యార్థుల భవిష్యత్తుపైనా పడుతోంది. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో కొన్ని కాలేజీలు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, డిగ్రీ పత్రాలను నిలిపివేస్తున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడం, ఉన్నత విద్యకు వెళ్లడం, తదుపరి కోర్సుల్లో చేరడం వంటి అవకాశాలకు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నుంచి బకాయిలు రాలేదన్న కారణంతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు నిలిపివేయడం సమర్థనీయం కాదని గతంలో ఉన్నత విద్యా మండలి స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు కూడా ఒక కేసులో విద్యార్థుల పత్రాలను తిరిగి ఇవ్వాలని ఆదేశించింది. బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నాయి. మరోవైపు ప్రభుత్వం ఆర్థిక పరిమితుల మధ్య బకాయిలను విడతలవారీగా చెల్లిస్తున్నామని చెబుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం-కాలేజీల మధ్య వివాదం నేరుగా విద్యార్థులపై ప్రభావం చూపుతోంది. 2026-27 నుంచి రీయింబర్స్‌మెంట్‌ను డీబీటీ ద్వారా నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేసే విధానం అమల్లోకి రావడం భవిష్యత్‌లో సమస్యను తగ్గించే ప్రయత్నంగా కనిపిస్తోంది. అయితే ఇప్పటికే పేరుకుపోయిన పాత బకాయిల సంగతేంటి? అన్న ప్రశ్నకు మాత్రం సమాధానం రావాల్సి ఉంది.

**లెక్క బయటపెడితేనే స్పష్టత**

ప్రభుత్వం 2020-21 నుంచి ఇప్పటివరకు విద్యా సంవత్సరం వారీగా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ వారీగా మంజూరు చేసిన మొత్తం, విడుదల చేసిన మొత్తం, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న మొత్తం వివరాలను బహిర్గతం చేయాల్సి ఉంది. అలాగే కాలేజీల వారీగా బకాయిలు, చెల్లింపుల వివరాలను వెల్లడిస్తేనే అసలు పరిస్థితి స్పష్టమవుతుంది. బీజేపీ చెబుతున్న రూ.15 వేల కోట్లలో ఎంత వాస్తవం? కాలేజీలు చెబుతున్న బకాయిలు ఎంత? ప్రభుత్వం ఇప్పటికే ఎంత చెల్లించింది? ఇంకా ఎంత ఇవ్వాలి? ఈ ప్రశ్నలకు అధికారిక సమగ్ర లెక్కే తుది సమాధానం. అప్పటివరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై రాజకీయ ఆరోపణలు, కాలేజీల ఆందోళనలు, విద్యార్థుల కష్టాలు కొనసాగుతూనే ఉండే పరిస్థితి కనిపిస్తోంది.

# వందేమాతరంపై రాజీ వద్దు!

- కాంగ్రెస్ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకం
- రెండు చరణాలకే పరిమితం చేయడంపై అభ్యంతరం
- వందేమాతరం చరిత్ర, వారసత్వంపై దేశవ్యాప్త ప్రచారం
- రాజ్యాంగం, పార్లమెంట్ కంటే ఎవరూ గొప్ప కాదు
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్

**కాకతీయ, న్యూఢిల్లీ:** వందేమాతరం విషయంలో కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతోందని బీజేపీ ఆరోపించింది. కాంగ్రెస్ కార్యక్రమాల్లో వందేమాతరం గేయాన్ని తొలి రెండు చరణాలకే పరిమితం చేయాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శనివారం తీర్మానం చేసింది. రాజకీయ ప్రయోజనాల కోసం జాతీయ గేయం గౌరవం, వారసత్వం విషయంలో రాజీ పడబోమని స్పష్టం చేసింది. ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధ్యక్షతన జరిగిన పార్టీ నూతన పదాధికారుల సమావేశంలో ఈ తీర్మానం ఆమోదించారు. వందేమాతరం చరిత్ర, జాతీయ ప్రాముఖ్యత, స్వాతంత్ర్య పోరాటంతో ఉన్న అనుబంధాన్ని యువతకు వివరించేలా దేశవ్యాప్తంగా ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ తెలిపింది. పార్లమెంట్ తీసుకున్న నిర్ణయాలే దేశ నిర్ణయాలని, ఏ పార్టీ, వ్యక్తి రాజ్యాంగం, చట్టాలు, పార్లమెంట్ కంటే గొప్ప కాదని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర పేర్కొన్నారు. వందేమాతరం గౌరవం, హుందాతనం, వారసత్వాన్ని కాపాడేందుకు ఎలాంటి రాజీకి అంగీకరించబోమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పష్టం చేశారు.

# డార్క్‌స్టోర్లపై టీజీసేఫ్ మెరుపుదాడులు!

**(మొదటిపేజీ తరువాయి)**

పాడైపోయే ఆహార పదార్థాలను సరైన పద్ధతిలో నిర్వహించకపోవడంతో పాటు.. వాటిని నిల్వ చేసే ఉష్ణోగ్రతలను కూడా కొన్ని చోట్ల పాటించలేదని తనిఖీల్లో గుర్తించినట్లు తెలిపారు.

**గడువు ముగిసిన ఆహార పదార్థాలు**

కొన్ని డార్క్‌స్టోర్లలో గడువు ముగిసిన ఆహార పదార్థాలు, ప్యాకేజ్డ్ ఫుడ్ ఉత్పత్తులను కూడా నిల్వ ఉంచినట్లు అధికారులు గుర్తించారు. వినియోగదారులకు పంపించే సరుకులో ఇలాంటి ఉత్పత్తులు చేరే అవకాశం ఉండటంతో అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాణ్యతపై అనుమానం ఉన్న పలు ఆహార పదార్థాల నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షలకు పంపించారు. ల్యాబ్ నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆహార భద్రత నిబంధనలను ఉల్లంఘించిన డార్క్‌స్టోర్ల నిర్వాహకులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే సంబంధిత సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. అవసరమైతే క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని తెలిపారు. క్విక్ కామర్స్ సంస్థలు వేగంగా డెలివరీ చేయడంపై చూపుతున్న శ్రద్ధ.. ఆహార పదార్థాల భద్రత, నాణ్యతపైనా ఉండాలని అధికారులు సూచించారు. డార్క్‌స్టోర్లలో నిల్వ చేసే ఆహార పదార్థాల పరిశుభ్రత, గడువు, ఉష్ణోగ్రతలు, నిల్వ విధానాలపై ఇకపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు టీజీసేఫ్ అధికారులు తెలిపారు.

# మాపై వ్యాఖ్యల వెనుక అదృశ్య హస్తం!

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తనను, తన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని పలువురు కాంగ్రెస్ నేతలు ఒకే తరహాలో బహిరంగ వ్యాఖ్యలు చేయడం వెనుక 'అదృశ్య హస్తం' ఉన్నట్లు అనుమానం కలుగుతోందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఎవరో ఒకరు నేతలను ప్రేరేపిస్తూ, సమన్వయం చేస్తూ నిర్దిష్ట లక్ష్యంతో తనపై, తన కుటుంబంపై వ్యాఖ్యలు చేయిస్తున్నారనే అనుమానం ఉందని తెలిపారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి.. వ్యాఖ్యలు చేయిస్తున్న అసలు వ్యక్తులను గుర్తించి పార్టీ క్రమశిక్షణ నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవిని కోరారు. ఈ మేరకు శనివారం ఆయనకు లేఖ రాశారు. టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ తనకు జారీ చేసిన నోటీసుకు ఇప్పటికే వివరణ సమర్పించినట్లు సురేఖ తెలిపారు. పార్టీ నాయకత్వంపై, క్రమశిక్షణ నియమావళిపై తనకు పూర్తి గౌరవం ఉందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలను పరిగణనలోకి తీసుకుని తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు.

**ఒకే తరహాలో వరుస వ్యాఖ్యలు**

పలువురు సీఎల్పీ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ హోదాల్లోని ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నేతలు తనను, తన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని ఒకే తరహాలో వ్యాఖ్యలు చేస్తున్నారని సురేఖ పేర్కొన్నారు. వారి వ్యాఖ్యలను పరిశీలిస్తే.. వాటి వెనుక ఎవరో ఒకరు ఉండి ప్రేరేపిస్తున్నారనే అనుమానం కలుగుతోందన్నారు. తాను, తన కుటుంబ సభ్యులపై స్వతంత్రంగా అభిప్రాయాలు వ్యక్తం చేయడం కంటే.. ఒక నిర్దిష్ట లక్ష్యంతో, ఎవరో నిర్దేశించిన విధంగా మాట్లాడుతున్న పరిస్థితి కనిపిస్తోందని తెలిపారు. ముఖ్యంగా పార్టీ క్రమశిక్షణ కమిటీ తనపై విచారణ కొనసాగిస్తున్న సమయంలోనే ఇలాంటి వ్యాఖ్యలు వెలువడటం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. తనపై వ్యాఖ్యలు చేస్తున్న నేతలను వెనుక నుంచి ప్రోత్సహిస్తూ, సమన్వయం చేస్తూ వ్యవహారాన్ని నడిపిస్తున్న అసలు వ్యక్తులు ఎవరో గుర్తించాలని సురేఖ కోరారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ బీసీ మహిళా నాయకురాలైన తనపై తీవ్ర వ్యాఖ్యలతో సామూహిక దాడులు జరుగుతున్న సమయంలో పార్టీ నాయకత్వం మౌనం వహించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తనను బహిరంగంగా నిందిస్తూ, రాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇస్తూ, తనపై చర్యలు తీసుకోవాలని మీడియా ముందుకు రావడం ద్వారా క్రమశిక్షణ కమిటీ స్వతంత్ర నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం జరిగిందా అనే కోణంలోనూ పరిశీలించాలని కోరారు.

**పార్టీ క్రమశిక్షణపై పూర్తి గౌరవం**

కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, బలహీన వర్గాల ఆత్మగౌరవానికి కట్టుబడి ఉన్న పార్టీ అని సురేఖ పేర్కొన్నారు. పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణ నియమావళిపై తనకు పూర్తి గౌరవం ఉందని స్పష్టం చేశారు. తనపై జరుగుతున్న వ్యాఖ్యలను కేవలం వ్యక్తిగత విమర్శలుగా చూడకుండా.. వాటి వెనుక ఉన్న సమన్వయం, ప్రేరేపణ, లక్ష్యాన్ని కూడా పరిశీలించాలని కోరారు. తనపై, తన కుటుంబ సభ్యులపై ఒకే విధమైన వ్యాఖ్యలు చేయిస్తున్న వారి వ్యవహారంపై వాస్తవాలను వెలికితీసి, బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తనకు జారీ చేసిన నోటీసుకు ఇప్పటికే వివరణ ఇచ్చినందున దానిని ఉపసంహరించుకోవాలని కోరుతూ.. అదే సమయంలో తనపై, తన కుటుంబంపై జరుగుతున్న వరుస వ్యాఖ్యల వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవిని కోరారు.

# సీన్ రివర్స్!

**(మొదటిపేజీ తరువాయి)**

కాంగ్రెస్‌లో మొదట తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ముఖ్యమంత్రిపై సొంత పార్టీకి చెందిన కుటుంబం నుంచి ఇలాంటి వ్యాఖ్యలు రావడాన్ని నాయకత్వం తీవ్రంగా పరిగణించినట్లు ప్రచారం జరిగింది. సీఎల్పీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం, మహిళా నేతలు బహిరంగంగా స్పందించడం కూడా ఈ వివాదం తీవ్రతను పెంచింది. దీంతో పార్టీ క్రమశిక్షణ కింద చర్యలు తప్పవన్న అభిప్రాయం బలపడింది. అయితే ఇప్పుడు పరిస్థితి మారిందన్న చర్చ సాగుతోంది. జాతీయ నాయకత్వం నుంచి వచ్చిన సూచనలతోనే రాష్ట్ర నాయకత్వం దూకుడును తగ్గించిందన్న ప్రచారం కాంగ్రెస్ వర్గాల్లో వినిపిస్తోంది. సురేఖపై వెంటనే చర్యలు తీసుకుంటే బీసీ మహిళా మంత్రిపై పార్టీ వివక్ష చూపుతోందన్న భావన ఏర్పడే అవకాశం ఉందని అధిష్ఠానం ఆరా తీసినట్లు సమాచారం.

**కొండా కుటుంబానికి ఢిల్లీ అండా?**

కొండా కుటుంబానికి కాంగ్రెస్ అధిష్ఠానంతో ఉన్న పాత సంబంధాలు ఇప్పుడు మరోసారి చర్చకు వస్తున్నాయి. ముఖ్యంగా సోనియాగాంధీతో కొండా కుటుంబానికి ఉన్న రాజకీయ అనుబంధం నేపథ్యంలో ఈ వివాదంలో జాతీయ నాయకత్వం జాగ్రత్తగా వ్యవహరిస్తోందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఒక మంత్రి కుటుంబానికి సంబంధించిన వివాదాన్ని కేవలం క్రమశిక్షణ సమస్యగా చూడకుండా.. దాని వెనుక ఉన్న సామాజిక, రాజకీయ అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఢిల్లీ పెద్దలు భావిస్తున్నారన్న చర్చ సాగుతోంది. అందుకే తొలుత కనిపించినంత వేగంగా చర్యలు లేకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**మల్లు రవి స్వరం మారిందా?**

ఈ పరిణామాల మధ్య కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి వైఖరిపైనా చర్చ మొదలైంది. మొదట తీవ్రంగా స్పందించిన నాయకుల స్వరాల్లోనూ ఇప్పుడు మార్పు కనిపిస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీసీ మహిళా మంత్రి విషయంలో పార్టీలోని పలువురు నేతలు ఒకేసారి మాట్లాడటం సరికాదన్న భావన అధిష్ఠానం వ్యక్తం చేసిందా? అందుకే కొందరు నాయకులు తమ వ్యాఖ్యలను మృదువుగా మార్చుకున్నారా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే ఈ మార్పు వెనుక అధికారికంగా ఏ నిర్ణయం వెలువడలేదు. కానీ రాష్ట్ర కాంగ్రెస్‌లో తాజా పరిణామాలను గమనిస్తున్న నేతలు మాత్రం ఢిల్లీ నుంచి వచ్చిన సంకేతాల ప్రభావమేనని విశ్లేషిస్తున్నారు.

**'సీఎం వచ్చాకే మాట్లాడుతా'..**

తన కుమార్తె వ్యాఖ్యలపై కొండా సురేఖ ఇప్పటివరకు బహిరంగంగా ఘాటైన వివరణ ఇవ్వకుండా ''ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చిన తర్వాత మాట్లాడుతా'' అన్న ధోరణి అవలంబించడం కూడా చర్చనీయాంశమైంది. సాధారణంగా ఇలాంటి వివాదం తలెత్తిన వెంటనే మంత్రి తన వైఖరిని స్పష్టం చేయాల్సి ఉండగా.. సీఎం రాక కోసం వేచి చూస్తానని చెప్పడం వెనుక అంతరార్థం ఏమిటన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సీఎంతో నేరుగా మాట్లాడి సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నమా? లేక అధిష్ఠానం నుంచి వచ్చిన సూచనల మేరకు వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నారా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. రేవంత్‌రెడ్డి తిరిగి హైదరాబాద్‌కు వచ్చిన తర్వాతే ఈ వివాదంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**బీసీ కార్డు తెరపైకి..**

ఇప్పటివరకు వ్యవహారం ముఖ్యమంత్రి వర్సెస్ కొండా కుటుంబంగా కనిపించినా.. ఇప్పుడు బీసీ మహిళా మంత్రి అంశం కూడా చర్చలోకి రావడం పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మార్చింది. ఒక బీసీ మహిళా మంత్రిపై పార్టీకి చెందిన పలువురు నేతలు వరుసగా బహిరంగంగా మాట్లాడటం ఎందుకన్న ప్రశ్నను అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే రాష్ట్ర రాజకీయాల్లో సామాజిక సమీకరణాలు కీలకంగా మారిన నేపథ్యంలో సురేఖపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా కొత్త రాజకీయ సమస్యలు తలెత్తకుండా జాతీయ నాయకత్వం జాగ్రత్త పడుతోందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. దీంతోనే చర్యల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోందన్న ప్రచారం సాగుతోంది.

**సీఎం కోటరీలో కలకలం!**

మొత్తంగా సుష్మిత వ్యాఖ్యలతో మొదలైన వివాదం ఇప్పుడు ముఖ్యమంత్రి కోటరీలోనే రాజకీయ కలకలానికి కారణమైందన్న చర్చ జరుగుతోంది. సీఎంకు మద్దతుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముందుకు వచ్చినా.. మంత్రుల మౌనం, ఆ తర్వాత జాతీయ నాయకత్వం జోక్యం చేసుకున్నట్లు జరుగుతున్న ప్రచారం కొత్త సమీకరణాలకు తెరతీసింది. ముఖ్యమంత్రి రాక తర్వాత కొండా సురేఖతో నేరుగా చర్చిస్తారా? సురేఖపై చర్యల విషయంలో వెనక్కి తగ్గుతారా? లేక పార్టీ క్రమశిక్షణను కాపాడేందుకు ఏదైనా నిర్ణయం తీసుకుంటారా? అన్నదే ఇప్పుడు కీలకం. మరోవైపు ఈ వ్యవహారంలో సోనియాగాంధీ స్థాయిలో కొండా కుటుంబానికి రాజకీయంగా అండ ఉందన్న ప్రచారం ఎంతవరకు వాస్తవమన్నదానిపైనా కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఒకవైపు సీఎంకు ఎమ్మెల్యేల బహిరంగ మద్దతు.. మరోవైపు మంత్రుల మౌనం.. ఇంకోవైపు అధిష్ఠానం జోక్యం అన్న ప్రచారం.. వెరసి తెలంగాణ కాంగ్రెస్‌లో ఈ వ్యవహారం ఇప్పుడు సాధారణ వివాదాన్ని దాటి నాయకత్వ సమీకరణాల పరీక్షగా మారింది.

# సురేఖపై మరోసారి చర్చిస్తాం!

- సుస్మిత వ్యాఖ్యల వీడియోలను క్షుణ్ణంగా పరిశీలించాం
- సురేఖ వివరణ అందింది.. మరింత చర్చించిన తర్వాతే నిర్ణయం
- కొందరు ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేస్తామన్నారు
- పార్టీ లైన్ దాటితే ఎవరిపైనైనా చర్యలు ఉంటాయి
- టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై మరోసారి క్రమశిక్షణ కమిటీ సమావేశమై నిర్ణయం తీసుకుంటుందని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తెలిపారు. శనివారం గాంధీభవన్‌లో జరిగిన కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కొండా సురేఖ ఇచ్చిన వివరణను పరిశీలించామని, ఆమె కుమార్తె కొండా సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను కూడా క్షుణ్ణంగా చూశామని చెప్పారు. సుస్మిత సీఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. సురేఖ వివరణపై మరోసారి చర్చించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో ఇటీవల పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడిన వారి వ్యవహారాలపై సుమారు మూడు గంటల పాటు చర్చించినట్లు మల్లు రవి తెలిపారు. కొండా సురేఖ వివరణ కమిటీకి అందిందని, దానిపై సభ్యులు చర్చించారని చెప్పారు. సుస్మిత మాట్లాడిన వీడియోలను కూడా పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఈ అంశంపై కొందరు ఎమ్మెల్యేలు క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేస్తామని చెప్పారని తెలిపారు.

**మరిన్ని ఫిర్యాదులు వస్తే పరిశీలిస్తాం**

కొండా సురేఖ అంశంలో మరికొందరు ఎమ్మెల్యేలు వివరాలు, ఫిర్యాదులు అందిస్తామని చెప్పారని మల్లు రవి తెలిపారు. అందరి ఫిర్యాదులను పరిశీలించిన తర్వాత తదుపరి సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ రోజే తుది నిర్ణయం తీసుకునే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై వచ్చిన అంశాలను కమిటీ క్షుణ్ణంగా పరిశీలిస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే చిన్నారెడ్డి ఇచ్చిన వివరణను కూడా క్రమశిక్షణ కమిటీ పరిశీలించిందని మల్లు రవి తెలిపారు. చిన్నారెడ్డి మాట్లాడిన వీడియోను పరిశీలించామని, ఈ అంశంపై ఎమ్మెల్యే మేఘారెడ్డి అభిప్రాయం తీసుకున్న తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కంది శ్రీనివాస్‌రెడ్డిని కూడా విచారించినట్లు, తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ఆయన ప్రకటించారని మల్లు రవి వెల్లడించారు. "పార్టీ లైన్ దాటితే ఎవరిపైనైనా చర్యలు ఉంటాయి. కొండా సురేఖ వివరణపై మరోసారి సమావేశమై నిర్ణయం తీసుకుంటాం" అని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి స్పష్టం చేశారు.

## నా తండ్రి మరణానికి సీతక్కే కారణం

- నా కుటుంబ విషాదాన్ని రాజకీయాలకు వాడొద్దు
- కాంగ్రెస్ నేతల ఇసుక, భూదందాలను పక్కదారి పట్టించేందుకే నా తండ్రి ప్రస్తావన
- సతీష్‌రెడ్డికి మా కుటుంబ ఘటనతో ఎలాంటి సంబంధం లేదు
- ములుగు మండల మాజీ బీఆర్ఎస్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి




కాకతీయ, వరంగల్ బ్యూరో: దాదాపు 39 ఏళ్ల క్రితం జరిగిన తమ కుటుంబ విషాదాన్ని ఇప్పుడు రాజకీయ వివాదంలోకి లాగడం సరికాదని ములుగు మండల మాజీ బీఆర్ఎస్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నేతల ఇసుక, భూదందాలు, సెల్‌ఫోన్ స్కామ్స్‌పై సతీష్‌రెడ్డి ప్రశ్నిస్తున్న నేపథ్యంలో.. వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే తన తండ్రి మరణం అంశాన్ని తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. తన తండ్రి మరణానికి అప్పటి నక్సలైట్లలో భాగమైన సీతక్కే కారణమని ఆయన ఆరోపించారు. ఈ ఘటనతో సతీష్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తన తండ్రిని మాట్లాడి పంపిస్తామని చెప్పి తీసుకెళ్లారని, అనంతరం ఆయన మృతదేహాన్ని ఇంటికి పంపించారని రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ ఘటన జరిగి దాదాపు నాలుగు దశాబ్దాలు గడిచిన తర్వాత దానిని ప్రస్తుత రాజకీయాలకు ముడిపెట్టడం బాధాకరమన్నారు. తన తండ్రి మరణాన్ని సతీష్‌రెడ్డికి ఆపాదించడం సమంజసం కాదని చెప్పారు. కాంగ్రెస్ నాయకుల ఇసుక దందాలు, భూదందాలు, సెల్‌ఫోన్ స్కామ్స్ తదితర అంశాలను సతీష్‌రెడ్డి ప్రజల దృష్టికి తీసుకువస్తున్నారని తెలిపారు. దీంతో ఆయనపై రాజకీయంగా ఎదురుదాడి చేసేందుకే తమ కుటుంబానికి సంబంధించిన పాత విషాదాన్ని బయటకు తీస్తున్నారని ఆరోపించారు.

### చనిపోయింది నా తండ్రి

"చనిపోయింది నా తండ్రి. ఆ ఘటనపై బాధ, ఆవేదన ఎవరికైనా ఉంటే మొదట నాకు ఉండాలి. సతీష్‌రెడ్డికి మా కుటుంబ ఘటనతో ఎలాంటి సంబంధం లేదు. రాజకీయ స్వలాభం కోసం ఈ విషాదాన్ని ఆయనకు ఆపాదించడం సరికాదు" అని రమేష్‌రెడ్డి అన్నారు. తాను, సీతక్క కుమారుడు కుంజ సూర్య చిన్న వయసులోనే తమ తండ్రులను కోల్పోయామని తెలిపారు. తమ కుటుంబాల్లో జరిగిన విషాదాలను రాజకీయాలకు ఉపయోగించుకోవడం బాధాకరమన్నారు. ములుగులో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలను ప్రజలు నిశితంగా గమనించాలని రమేష్‌రెడ్డి కోరారు. ఎవరు ఏ అంశాన్ని ఎందుకు తెరపైకి తెస్తున్నారో ఆలోచించాలని సూచించారు. తన తండ్రి మరణం తమ కుటుంబానికి ఎప్పటికీ మాయని విషాదమని, దానిని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడాన్ని సహించబోమని స్పష్టం చేశారు. తన కుటుంబ ఘటనను ప్రస్తుత రాజకీయ వివాదాలకు ఆపాదించే ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు.

## హైదరాబాద్‌లో లండన్ యూనివర్సిటీ క్యాంపస్!

- క్యాంపస్ ఏర్పాటుకు లండన్ యూనివర్సిటీ ప్రతినిధుల కసరత్తు
- విస్తృత విద్యా కోర్సులు, కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళిక
- ఎల్ఎస్ఈ, ఎస్ఓఏఎస్ ప్రతినిధులతో తెలంగాణ రైజింగ్ బృందం భేటీ
- సీఎం ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో లండన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం



కాకతీయ, హైదరాబాద్ : హైదరాబాద్‌లో లండన్ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ కృషి చేస్తోందని ప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి తెలిపారు. లండన్ యూనివర్సిటీ సెనేట్ హౌస్‌లో సీఎం నేతృత్వంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం లండన్ యూనివర్సిటీ ప్రతినిధులతో సుదీర్ఘంగా సమావేశమైంది. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ అధికారులు కే. రామకృష్ణారావు, జయేశ్ రంజన్ పాల్గొన్నారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ (ఎల్ఎస్ఈ), స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ (ఎస్ఓఏఎస్) ప్రతినిధులు కూడా సమావేశానికి హాజరయ్యారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న క్యాంపస్‌లో లండన్ యూనివర్సిటీకి చెందిన వివిధ స్కూళ్లు, విభాగాల ద్వారా విస్తృత స్థాయిలో విద్యా కోర్సులు, కార్యక్రమాలు అందించాలని యోచిస్తున్నట్లు ప్రతినిధులు వెల్లడించారు. వివిధ విద్యా విభాగాలను ఒకే అకడమిక్ ఫెడరేషన్‌గా అనుసంధానించే విధంగా కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు తెలిపారు.

## వరంగల్‌లో విషాదం.. గర్భిణీ మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆరోపణ
- చికిత్స అనంతరం ఫిట్స్.. మరో ఆస్పత్రికి తరలింపు
- వెంకట్రామ థియేటర్ వద్ద రాస్తారోకో.. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్
- వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన మృతురాలి బంధువులు



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : వరంగల్ కాశిబుగ్గలో విషాదం చోటుచేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే గర్భిణీ మృతి చెందిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు వెంకట్రామ థియేటర్ సమీపంలో రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కాశిబుగ్గకు చెందిన అస్త్రం లత (34)కు గత మంగళవారం డాక్టర్ సంధ్యారాణి ఆస్పత్రిలో ప్రసవ ఆపరేషన్ జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం ఆమెకు ఫిట్స్ రావడంతో సంరక్ష ఆస్పత్రికి తరలించారని, అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 11 గంటలకు మృతి చెందినట్లు చెప్పారు. వైద్యుల తప్పుడు చికిత్స వల్లే లత మృతి చెందిందని వారు ఆరోపించారు. పుట్టిన శిశువు క్షేమంగా ఉన్నట్లు సమాచారం. లత మృతికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేసే వరకు ఆందోళన విరమించేది లేదంటూ బంధువులు రోడ్డుపై బైఠాయించారు. దీంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు.



# కొండాయిగూడెం ర్యాంప్‌లో ఓవర్‌లోడింగ్!

- 49.5 టన్నుల పరిమితి.. 57 టన్నుల వరకు ఇసుక రవాణా?
- గురువారం రోజంతా ఓవర్‌లోడ్ లారీలే..
- విషయం బయటకు రాగానే ఎస్ఆర్ఏ బదిలీ?
- లారీకి రూ.2,300 వసూలు.. ఓవర్‌లోడ్‌కు అదనపు వసూళ్లు?
- శ్రీకర్ కనుసన్నల్లోనే వ్యవహారమా?.. అధికారుల చర్యలపై ప్రశ్నలు



కాకతీయ, తెలంగాణ బ్యూరో : కొండాయిగూడెం ఇసుక ర్యాంప్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఓవర్‌లోడింగ్ జరుగుతున్నట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. నిబంధనల ప్రకారం లారీ బరువుతో కలిపి గరిష్ఠంగా 49,500 కిలోలు మాత్రమే ఉండాల్సి ఉండగా.. ర్యాంప్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కొన్ని లారీల్లో సుమారు 57 వేల కిలోల వరకు ఇసుక లోడ్ చేస్తున్నట్లు సమాచారం. అంటే ఒక్కో లారీలో దాదాపు 7.5 టన్నుల అదనపు లోడ్ ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గురువారం రోజంతా ఈ తరహా ఓవర్‌లోడింగ్ జరిగినట్లు సమాచారం. ఈ వ్యవహారం బయటకు వచ్చిన తర్వాత సంబంధిత ఎస్ఆర్ఏను బదిలీ చేసినట్లు తెలిసినా.. ఓవర్‌లోడింగ్‌కు అసలు బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### 57 టన్నుల లోడింగ్ ఎలా?

కొండాయిగూడెం ర్యాంప్ నుంచి ఓవర్‌లోడ్‌తో హైదరాబాద్‌కు వెళ్తున్న లారీల దృశ్యాలు బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. సాధారణంగా 49.5 టన్నుల పరిమితి ఉండగా.. 57 టన్నుల వరకు లోడ్ చేయడం వెనుక ఎవరి అనుమతి ఉందన్నది కీలకంగా మారింది. గురువారం రోజంతా ఓవర్‌లోడింగ్ జరిగినట్లు సమాచారం ఉన్న నేపథ్యంలో.. ఆ రోజు ర్యాంప్ నుంచి బయటకు వెళ్లిన వాహనాలన్నింటి తూకం వివరాలను పరిశీలిస్తే అసలు విషయం తేలే అవకాశం ఉంది. వెయ్‌బ్రిడ్జి రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, రవాణా వివరాలు, సీసీటీవీ ఫుటేజీని అధికారులు పరిశీలించాల్సి ఉంది. ఓవర్‌లోడ్ లారీలను తూకం వేసినట్లయితే ఎంత బరువు నమోదైంది? అదనపు లోడ్ గుర్తించిన తర్వాత ఏ చర్యలు తీసుకున్నారు? అనే వివరాలు కూడా వెలుగులోకి రావాల్సి ఉంది.

### విషయం బయటకు రాగానే బదిలీ?

ఓవర్‌లోడింగ్ వ్యవహారం బయటకు వచ్చిన తర్వాత ర్యాంప్‌లో పనిచేస్తున్న ఎస్ఆర్ఏను బదిలీ చేసినట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అయితే ఓవర్‌లోడింగ్ ఒక్క అధికారి పర్యవేక్షణతోనే సాధ్యమవుతుందా? ర్యాంప్‌లో లోడింగ్, తూకం, వాహనాల బయటకు పంపడం వంటి ప్రక్రియల్లో మరెవరి పాత్ర ఉంది? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బదిలీతోనే వ్యవహారాన్ని ముగించకుండా.. ఓవర్‌లోడ్ చేయించిన వారు, అనుమతించిన వారు, పర్యవేక్షించిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకు సంబంధించి అధికారులు ఏం చర్యలు తీసుకున్నారన్నది స్పష్టం చేయాల్సి ఉంది. ర్యాంప్‌లో ప్రతి లారీ నుంచి లోడింగ్, కాంటా సీరియల్ పేరుతో రూ.2,300 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. దీనికి అదనంగా ఓవర్‌లోడ్ కోసం ఒక్కో బకెట్‌కు మరో రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ మొత్తాలను ఎవరు వసూలు చేస్తున్నారు? అధికారిక రసీదులు ఇస్తున్నారా? ర్యాంప్ రికార్డుల్లో ఈ లావాదేవీలు నమోదవుతున్నాయా? అనే అంశాలపై విచారణ అవసరమని తెలుస్తోంది. తూకం రికార్డులు, ర్యాంప్ రిజిస్టర్లు, వాహనాల వివరాలు, చెల్లింపుల ఆధారాలను పరిశీలిస్తే వసూళ్ల వ్యవహారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

### శ్రీకర్ కనుసన్నల్లోనే ఓవర్‌లోడింగ్?

కొండాయిగూడెం ర్యాంప్ కాంట్రాక్టర్ శ్రీకర్ కనుసన్నల్లోనే ఓవర్‌లోడింగ్, అదనపు వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా ఎలాంటి నిర్ధారణ జరగలేదు. కాంట్రాక్టర్‌కు ఇందులో ప్రత్యక్ష పాత్ర ఉందా? ర్యాంప్ సిబ్బంది ఎవరి ఆదేశాలతో ఓవర్‌లోడ్ చేస్తున్నారు? అన్నది విచారణలో తేలాల్సి ఉంది. అదే సమయంలో రాత్రివేళల్లో లోడింగ్, తూకం, అన్‌లోడింగ్ జరిగినట్లు వస్తున్న ఆరోపణలపైనా అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది. ఆయా సమయాల్లోని సీసీటీవీ ఫుటేజీ, వెయ్‌బ్రిడ్జి రికార్డులను సరిపోల్చితే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది. ఓవర్‌లోడింగ్ నిజమైతే ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడంతో పాటు రహదారి భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. నిబంధనలు పాటిస్తూ ఇసుక రవాణా చేస్తున్న లారీ యజమానులకు కూడా అన్యాయం జరుగుతుంది. అందువల్ల కొండాయిగూడెం ర్యాంప్‌లో గురువారం జరిగిన లోడింగ్ మొత్తం రికార్డులను పరిశీలించి.. ఓవర్‌లోడింగ్‌కు బాధ్యులెవరో తేల్చి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. బదిలీతో సరిపెట్టకుండా అసలు వ్యవహారం వెనుక ఉన్న వ్యక్తులు, విధుల్లో ఉన్న సిబ్బంది పాత్రపై సమగ్ర విచారణ జరపాల్సి ఉంది.

## స్థానిక ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం



- కమ్యూనిటీ, ఏరియా, జిల్లా ఆస్పత్రులను బలోపేతం చేయాలి
- అవసరమైతేనే పేషెంట్లను రిఫర్ చేయాలి
- అవసరమైన చోట కొత్త సీటీ స్కాన్లు
- వారానికి ఒకరోజు ఆకస్మిక తనిఖీలు తప్పనిసరి
- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

కాకతీయ, హైదరాబాద్ : కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా, జిల్లా ఆస్పత్రులను మేజర్ సర్జరీలు సైతం నిర్వహించే స్థాయిలో పూర్తిస్థాయి వైద్య కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించేలా ఆస్పత్రులను బలోపేతం చేయాలని సూచించారు. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు, మౌలిక వసతులు, మానవ వనరులు, పరికరాలపై హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. టీచింగ్ ఆస్పత్రుల్లో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయగా, జిల్లా, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 1,616 మంది స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించామని తెలిపారు.

### అవసరమైతేనే రిఫర్ చేయాలి

చిన్న సమస్యలకు సైతం పేషెంట్లను పెద్ద ఆస్పత్రులకు పంపడం సరికాదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రిఫర్ చేయాల్సి వస్తే ముందుగానే సంబంధిత ఆస్పత్రికి సమాచారం అందించి సమన్వయం చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న వైద్యులు, బెడ్లు, పరికరాలు, డయాగ్నస్టిక్ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. అవసరమున్న ఆస్పత్రుల్లో సీటీ స్కాన్లు, ఇతర వైద్య పరికరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. రోగుల సంఖ్య, అవసరం, వినియోగ సామర్థ్యంపై స్పష్టమైన వివరాలతో ప్రతిపాదనలు పంపాలన్నారు. డీసీహెచ్ఎస్‌లు వారానికి కనీసం ఒకరోజు ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది హాజరు, వైద్య సేవలు, మందులు, పరికరాలు, పరిశుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణను పరిశీలించాలన్నారు. విధులకు గైర్హాజరు, ముందే వెళ్లిపోవడం, నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## జూబ్లీహిల్స్‌లో బ్లాక్‌మెయిల్ ముఠా

- సంపన్న కుటుంబాల మైనర్లే లక్ష్యంగా ట్రాప్
- సన్నిహిత దృశ్యాలను రహస్యంగా చిత్రీకరణ
- వీడియోలతో బెదిరించి డబ్బుల డిమాండ్
- ప్రధాన నిందితురాలు మీనాకుమారి నుంచి వివరాలు..



కాకతీయ, హైదరాబాద్ : జూబ్లీహిల్స్‌లో సంపన్న కుటుంబాలకు చెందిన మైనర్లను లక్ష్యంగా చేసుకుని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న ముఠా వ్యవహారంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ప్రధాన నిందితురాలు మీనాకుమారిని రెండు రోజుల కస్టడీకి తీసుకున్న విమెన్ సేఫ్టీ పోలీసులు మైనర్లను ట్రాప్ చేసిన విధానం, రహస్యంగా వీడియోలు చిత్రీకరించడం, వాటితో డబ్బులు డిమాండ్ చేసిన తీరుపై విచారించారు. కస్టడీ ముగియడంతో శనివారం సాయంత్రం ఆమెను కోర్టులో హాజరుపరచనున్నారు. సోషల్ మీడియా ద్వారా మైనర్లతో పరిచయాలు పెంచుకుని, సన్నిహితంగా మెలిగేలా చేసి రహస్యంగా వీడియోలు చిత్రీకరించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ వీడియోలను చూపించి బెదిరింపులకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలినట్లు తెలిపారు. ఇప్పటికే ఆజాద్, రాజీవ్‌లను అరెస్టు చేయగా, మీనాకుమారిని కూడా అరెస్టు చేసి విచారించారు. ముఠా ఎవరెవరిని లక్ష్యంగా చేసుకుంది? ఎన్ని వీడియోలు ఉన్నాయి? ఎంత మొత్తంలో డబ్బు డిమాండ్ చేశారు? అనే అంశాలపై పోలీసులు ఆరా తీసినట్లు సమాచారం. కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి తెచ్చేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## రూ.7 వేల కోట్లతో ఎల్పీజీ పైప్‌లైన్లు!

- 1,800 కి.మీ. మేర మూడు కొత్త మార్గాలకు పీఎన్‌జీఆర్‌బీ ఆమోదం
- తెలంగాణ సహా ఆరు రాష్ట్రాలకు విస్తరించనున్న నెట్‌వర్క్
- రోడ్డు రవాణా తగ్గించి.. సురక్షిత, చౌకైన సరఫరాకు ప్రాధాన్యం
- గెయిల్ ఆధ్వర్యంలో నిర్మాణం.. 9,500 కి.మీ.కు చేరనున్న పైప్‌లైన్ నెట్‌వర్క్




కాకతీయ, తెలంగాణ బ్యూరో : దేశంలో ఎల్పీజీ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు పెట్రోలియం, సహజవాయు నియంత్రణ బోర్డు (పీఎన్‌జీఆర్‌బీ) కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు రూ.7 వేల కోట్ల వ్యయంతో 1,800 కిలోమీటర్ల మేర మూడు కొత్త ఎల్పీజీ పైప్‌లైన్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, గోవా రాష్ట్రాలను అనుసంధానించే ఈ ప్రాజెక్టులను ప్రభుత్వ రంగ సంస్థ గెయిల్ నిర్మించనుంది. ప్రాజెక్టులు పూర్తయితే దేశంలో కామన్ క్యారియర్ ఎల్పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ 7,700 కి.మీ. నుంచి దాదాపు 9,500 కి.మీ.కు విస్తరించనుంది. పీఎన్‌జీఆర్‌బీ ఆమోదించిన మూడు ప్రాజెక్టుల్లో ఒకటి తెలంగాణలోని చర్లపల్లి నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వరకు నిర్మించనున్నారు. మొత్తం 556 కిలోమీటర్ల మేర ఈ ఎల్పీజీ పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నారు. మరో ప్రాజెక్టు ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీ నుంచి ఉత్తరాఖండ్‌లోని సితార్‌గంజ్ వరకు 611 కి.మీ. పొడవున నిర్మించనున్నారు. మహారాష్ట్రలోని షిక్రాపూర్ నుంచి కర్ణాటకలోని హుబ్లీ వరకు మూడో పైప్‌లైన్ 633 కి.మీ. మేర ఏర్పాటు కానుంది.

### ట్యాంకర్ల రవాణాకు కళ్లెం

ప్రస్తుతం సుదూర ప్రాంతాలకు ఎల్పీజీని తరలించేందుకు పెద్దఎత్తున ట్యాంకర్లను వినియోగిస్తున్నారు. దీంతో రహదారులపై వాహనాల రద్దీ పెరగడంతో పాటు ఎల్పీజీ ట్యాంకర్ల ప్రమాదాల నేపథ్యంలో భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాథమిక ఎల్పీజీ రవాణాను రోడ్డు మార్గం నుంచి పైప్‌లైన్లకు మార్చడంపై పీఎన్‌జీఆర్‌బీ దృష్టి సారించింది. కొత్త నెట్‌వర్క్ అందుబాటులోకి వస్తే ఎల్పీజీ ట్యాంకర్ల రాకపోకలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఎల్పీజీని సుదూర ప్రాంతాలకు తరలించేందుకు పైప్‌లైన్ వ్యవస్థ సురక్షితమైన, ఆర్థికంగా ప్రయోజనకరమైన మార్గంగా పరిగణిస్తున్నట్లు పీఎన్‌జీఆర్‌బీ పేర్కొంది. రోడ్డు రవాణాపై ఆధారపడటాన్ని తగ్గించడం వల్ల ప్రమాదకర ఇంధనాన్ని ట్యాంకర్లలో తరలించే సమయంలో ఎదురయ్యే ముప్పులు తగ్గుతాయని తెలిపింది. ఒక ప్రాంతంలో రోడ్డు రవాణాకు అంతరాయం ఏర్పడినా పైప్‌లైన్ నెట్‌వర్క్ ద్వారా ప్రత్యామ్నాయంగా సరఫరాను కొనసాగించే అవకాశం ఉంటుంది. దేశంలో ఇప్పటికే 2,757 కిలోమీటర్ల పొడవైన కాండ్లా–గోరఖ్‌పూర్ ఎల్పీజీ పైప్‌లైన్ ఉంది. ఇది దేశంలోనే అత్యంత పొడవైన ఎల్పీజీ పైప్‌లైన్‌గా గుర్తింపు పొందింది. తాజాగా ఆమోదించిన మూడు ప్రాజెక్టులు గతంలో ఇచ్చిన అనుమతులకు కొనసాగింపుగా రానున్నాయి. వీటితో దేశవ్యాప్తంగా కామన్ క్యారియర్ ఎల్పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ సుమారు 1,800 కిలోమీటర్లు అదనంగా పెరిగి.. దాదాపు 9,500 కిలోమీటర్లకు చేరనుంది.

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా కె.పూజ

- బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తి
- ఉచిత న్యాయ సహాయానికి ప్రాధాన్యం
- లోక్‌అదాలత్‌లను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తాం
- ప్రజల్లో న్యాయ సేవలపై అవగాహన పెంపు లక్ష్యాలని వెల్లడి



కాకతీయ, వరంగల్ బ్యూరో : వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా కె.పూజ శనివారం బాధ్యతలు స్వీకరించారు. పదోన్నతిపై ఇంతకు ముందు వరంగల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన ఆమెను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఇన్‌చార్జి కార్యదర్శి ఎ.ప్రదీప్, సూపరింటెండెంట్ మోహన్‌రావు, సిబ్బంది కె.పూజకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల్లో న్యాయ సేవలపై అవగాహన పెంచడం తన ప్రధాన ప్రాధాన్యతలని తెలిపారు. లోక్‌అదాలత్‌లు, న్యాయ అవగాహన కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. న్యాయ సేవా కార్యక్రమాలను విస్తృతంగా ప్రజలకు చేరువ చేయాలని, ఇందుకు అధికారులు,సిబ్బంది,ప్యానెల్‌న్యాయవాదులుసమన్వయంతోపనిచేయాలని సూచించారు.

## వరంగల్‌లో పచ్చదనానికి ప్రాధాన్యం

- రూ.530 కోట్లతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- వనమహోత్సవంలో ఎమ్మెల్యే నాయిని
- త్వరలో యూజీడీ పనులు.. నీటి పైప్‌లైన్లు, రోడ్లు, సెంట్రల్ లైటింగ్ కూడా



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : నగరంలో పచ్చదనం, పరిశుభ్రతతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి సమగ్ర చర్యలు చేపడుతున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం హంటర్ రోడ్‌లోని 49వ డివిజన్ లెక్చరర్స్ కాలనీ, సాయి బృందావన్ కాలనీలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్నతో కలిసి వనమహోత్సవంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరానికి ఆధునిక అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ తీసుకొస్తున్నామని, ఇందుకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. యూజీడీతో పాటు నీటి పైప్‌లైన్లు, రోడ్లు, సెంట్రల్ లైటింగ్ పనులను సమగ్రంగా చేపడతామని తెలిపారు. ప్రజాధనం వృథా కాకుండా ప్రణాళికాబద్ధంగా పనులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. తాగునీటి సమస్యకు రూ.530 కోట్లతో శాశ్వత పరిష్కారం చూపుతున్నామని, వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ ఆధునీకరణతో పాటు కొత్త నిర్మాణాలు చేపడుతున్నామని చెప్పారు. కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ కాలనీల్లో పచ్చదనం పెంపునకు ప్రజలు నాటిన మొక్కలను సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## చిన్నముప్పారంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ

కాకతీయ, ఇనుగుర్తి: మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఇనుగుర్తి మండలం చెట్లముప్పారంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల ఇన్‌చార్జి చెడుపాక యాకన్న తెలిపారు. అధ్యక్షుడిగా దర్శనం శ్రీను, అధికార ప్రతినిధిగా దర్శనం యాకాంతం, ప్రధాన కార్యదర్శిగా తాళ్ల అనిల్, ఉపాధ్యక్షులుగా దర్శనం యాకన్న, దర్శనం సుధాకర్, దర్శనం సురేందర్, బూర లక్ష్మి, గణపతి, కోశాధికారిగా దర్శనం చిన్న యాకాంతం ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా బొల్లంపల్లి పరశురాములు, దర్శనం చిన్న వెంకన్న, దర్శనం నెంబర్ యాకయ్య, సహాయ కార్యదర్శులుగా దర్శనం వెంకన్న, దర్శనం నాగయ్య, కొత్త దర్శనం రాజు, దర్శనం కృష్ణ, దర్శనం మల్లయ్య ఎంపికయ్యారు. నూతన అధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతానన్నారు.

## ఏనుగు వెళ్తుంటే కుక్కలు మొరుగుతూనే ఉంటాయి!

- నా పనితనమే విమర్శలకు సమాధానం
- మళ్లీ నాకే ఎమ్మెల్యే టికెట్ ప్రకటించడం ఊహించలేదు
- ప్రజల స్పందన చూసే సీఎం నిర్ణయం
- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే రేవూరి




కాకతీయ, గీసుగొండ : "ఏనుగు వెళ్తుంటే కుక్కలు మొరుగుతూనే ఉంటాయి.. నా వయసుపై విమర్శలు చేస్తున్న వారికి నా పనితనమే సమాధానం" అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గీసుగొండ మండలంలోని ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం గీసుగొండ, సంగెం మండలాలతో పాటు గ్రేటర్ వరంగల్ 15, 16, 17వ డివిజన్ల లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విమర్శలకు ప్రతి విమర్శ చేసి సమయం వృథా చేసుకోనని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. ఇటీవల పరకాలలో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మళ్లీ తనకే ఎమ్మెల్యే టికెట్ ఇస్తున్నట్లు ప్రకటించడం తాను ఊహించలేదన్నారు. సమావేశానికి భారీగా తరలివచ్చిన ప్రజల స్పందనను చూసిన తర్వాతే సీఎం ఈ నిర్ణయం ప్రకటించారని చెప్పారు. ప్రజల అభిమానం, ఆశీర్వాదమే తనకు బలమన్నారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బయటకొస్తున్న బాధితులు

- మీ సేవ.. ఆధార్ కేంద్రాల్లో అడ్డదారిలో వసూళ్ల దందా
- నిర్ణీత రుసుములకు మించి ఇష్టారాజ్యంగా వసూళ్లు
- ఫిర్యాదులు చేసినా విచారణ పేరుతో కాలయాపన
- గిరిజనులే టార్గెట్.. వేల రూపాయలు వసూళ్లు
- జనన ధ్రువీకరణ పత్రాల పేరుతో రూ.5 నుండి 6 వేల వసూళ్లు
- తొమ్మిది మందిలో ఒక్కరికే సర్టిఫికెట్ జారీ
- అధికారులకు ఫిర్యాదు చేసినా తనిఖీలు కరువు
- కలెక్టర్ దృష్టి సారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయంటున్న బాధితులు

కాకతీయ, ఏటూరునాగారం : ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాల్సిన మీ సేవ, ఆధార్ కేంద్రాలే అదనపు వసూళ్లకు అడ్డాలుగా మారాయన్న ఆరోపణలు ములుగు జిల్లాలో కలకలం రేపుతున్నాయి. ఆధార్ నమోదు, అప్‌డేట్, జనన ధ్రువీకరణ పత్రాలు, ఇతర సర్టిఫికెట్ల కోసం వచ్చే ప్రజల నుంచి నిర్ణయించిన రుసుముల కంటే అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా గిరిజనులు, వలస కుటుంబాల అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు నిర్వాహకులు వేల రూపాయలు దండుకుంటున్నారని చెబుతున్నారు. తమకు ఎదురైన అనుభవాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా 'విచారణ చేస్తాం' అంటూ కాలయాపన చేస్తున్నారని బాధితులు పేర్కొంటున్నారు. దీంతో అక్రమ వసూళ్లపై అధికారుల పర్యవేక్షణ ఎక్కడ? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కేంద్రాల నిర్వాహకుల నుంచి అధికారులకు నెలవారీగా మామూళ్లు వెళ్తున్నాయన్న ఆరోపణలు సైతం ఈ వ్యవహారాన్ని మరింత తీవ్రం చేస్తున్నాయి.

### గుత్తికోయలే టార్గెట్.. వేల రూపాయలు వసూళ్లు

ఏటూరునాగారం మండల కేంద్రంలోని రెండు మీ సేవ కేంద్రాల్లో జరిగినట్లు బాధితులు చెబుతున్న వసూళ్ల వ్యవహారం ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. బాధితుల సమాచారం మేరకు.. సుమారు 15 రోజుల క్రితం చింతలపాడు గుత్తికోయగూడెంకు చెందిన తొమ్మిది మంది జనన ధ్రువీకరణ పత్రాల కోసం మండల కేంద్రంలోని మీ సేవ కేంద్రాలను ఆశ్రయించారు. గ్రామపంచాయతీ సమీపంలోని మీ సేవ కేంద్రంలో ఐదుగురి నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.6 వేల చొప్పున, పాత బస్టాండ్ చేపల మార్కెట్ సమీపంలోని మరో మీ సేవ కేంద్రంలో నలుగురి నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.5 వేల చొప్పున తీసుకున్నట్లు బాధితులు తెలిపారు. నిర్ణీత రుసుములకు మించి ఈ మొత్తాలను వసూలు చేసినట్లు వారు పేర్కొన్నారు. డబ్బులు చెల్లించిన తొమ్మిది మందిలో ఒక్కరికి మాత్రమే వారం రోజుల క్రితం జనన ధ్రువీకరణ పత్రం అందగా.. మిగిలిన ఎనిమిది మందికి ఇప్పటికీ అందలేదని తెలిపారు. నిర్ణీత రుసుము కంటే ఇంత భారీగా ఎందుకు వసూలు చేశారు? తీసుకున్న మొత్తాలకు రసీదులు ఇచ్చారా? అనే ప్రశ్నలకు సంబంధిత నిర్వాహకులు, అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### ఫిర్యాదులున్నా.. చర్యలు శూన్యం

మీ సేవ కేంద్రాలపై ఆరోపణలకు తోడు.. ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఓ ఆధార్ కేంద్రంలో అదనపు రుసుము డిమాండ్‌పై ఓ బాధితుడు చేసిన ఫిర్యాదుకు కూడా స్పందన లేకపోవడం మరింత చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఆధార్ అప్‌డేట్ కోసం కేంద్రానికి వెళ్లిన తనను నిర్వాహకుడు నిర్ణీత రుసుము కంటే అధికంగా డబ్బులు అడిగినట్లు బాధితుడు తెలిపారు. ఎందుకు ఎక్కువ తీసుకుంటున్నారని ప్రశ్నించగా 'ఇక్కడ ఇంతే' అంటూ దురుసుగా సమాధానం ఇచ్చినట్లు పేర్కొన్నారు. దీనిపై స్థానిక ఎంఆర్వోకు, అనంతరం మీ సేవ, ఆధార్ సంబంధిత జిల్లా అధికారికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయగా విచారణ చేపడతామని చెప్పినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసి వారం రోజులు దాటినా కేంద్రంపై తనిఖీ, విచారణ, చర్యలు ఏవీ చేపట్టలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. వరుస ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నా అధికారులు స్పందించకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. జిల్లా వ్యాప్తంగా పలు మీ సేవ, ఆధార్ కేంద్రాల్లో జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమ వసూళ్లపై జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించి ఆకస్మిక తనిఖీలు, సమగ్ర విచారణకు ఆదేశిస్తే అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని బాధితులు కోరుతున్నారు. నిర్ణీత రుసుముల వివరాలను కేంద్రాల్లో స్పష్టంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవడంతోపాటు, అదనపు వసూళ్లకు పాల్పడుతున్న కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులు అందినప్పటికీ స్పందించని అధికారుల తీరును కూడా పరిశీలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

### బాధితుడి వివరణ



జనన ధ్రువీకరణ పత్రం కోసం ఏటూరునాగారం గ్రామపంచాయతీ సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని సంప్రదించగా రూ.6 వేలు తీసుకున్నారు. నాతో పాటు మరో నలుగురి వద్ద కూడా ఇదే విధంగా వసూలు చేశారు. మరో నలుగురు చేపల మార్కెట్ సమీపంలోని మీ సేవకు వెళ్లగా ఒక్కొక్కరి వద్ద రూ.5 వేల చొప్పున తీసుకున్నారు. నా ధ్రువీకరణ పత్రం వచ్చింది.. మిగతా వారివి ఇప్పటికీ రాలేదు.

–మడకం ముఖేష్, చింతలపాడు తండా

### బాధితుడి వివరణ



ఇటీవల మా కుటుంబంలోని వ్యక్తికి ఆధార్ అప్‌డేట్ కోసం మండల కేంద్రంలోని ఆధార్ సెంటర్‌కు వెళ్లగా నిర్ణీత రుసుము కంటే అదనంగా డబ్బులు తీసుకున్నారు. ఇదేంటని ప్రశ్నించగా 'ఇక్కడ ఇంతే' అని సమాధానం ఇచ్చారు. ఈ విషయాన్ని ఎంఆర్వోతో పాటు జిల్లా మీ సేవ, ఆధార్ అధికారికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశాను. విచారణ చేస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

–గుండారపు శ్రీను, ఏటూరునాగారం

## దోచుకుందాం.. రా!

- వరంగల్ బల్దియాలో అవినీతికి పరాకాష్ట
- పనులు లేకున్నా బిల్లుల పంపకానికి స్కెచ్
- కాంట్రాక్టర్లకు అప్పనంగా బిల్లుల ఆశలు
- ముందస్తుగానే కమీషన్లు లాగేస్తున్నారన్న ఆరోపణలు
- ఆలస్యంగా వెలుగులోకి వస్తున్న పాత బాగోతం



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థలో అవినీతి వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. పనులు చేయకుండానే బిల్లులు.. ప్రొసీడింగ్స్ లేకుండానే పనులు చేసినట్లు రికార్డులు.. ముందుగానే కమీషన్లు.. ఆ తర్వాత భారీగా బిల్లులు.. ఇదీ బల్దియాలో కొందరు అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య సాగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ వ్యవహారం. కొన్నేళ్ల క్రితం జరిగిన ఈ బాగోతం తాజాగా వెలుగులోకి రావడంతో బల్దియా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పనులు చేయకున్నా బిల్లులు ఇప్పిస్తామంటూ కాంట్రాక్టర్లను ఆకర్షించి, అందులో నుంచి ముందుగానే కమీషన్లు తీసుకునే విధానం అమలైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### పార్కుల పనుల పేరుతో రూ.5 లక్షల వ్యవహారం

హనుమకొండ ప్రాంతంలోని రెండు, మూడు పార్కుల్లో అభివృద్ధి పనుల పేరుతో అప్పట్లో జరిగిన వ్యవహారమే ఇందుకు ఉదాహరణగా బల్దియా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆయా పార్కుల్లో పనులు చేపట్టేందుకు సరైన ప్రొసీడింగ్స్ లేకపోయినా.. వాటిని రికార్డుల్లో చూపించి బిల్లులు చేయించేలా ఓ ఇంజినీరింగ్ అధికారి ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ఓ కాంట్రాక్టర్‌ను సంప్రదించి రూ.5 లక్షలు కమీషన్‌గా ఇవ్వాలని సూచించినట్లు సమాచారం. ముందుగానే ఆ మొత్తాన్ని చెల్లిస్తే.. అనంతరం దానికి రెండు, మూడు రెట్లు విలువైన బిల్లులు ఇప్పిస్తామనే ఒప్పందం కుదిరినట్లు బల్దియా వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరో కాంట్రాక్టర్ నుంచి కూడా ఇదే తరహాలో డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే వ్యవహారం పూర్తిగా కార్యరూపం దాల్చకముందే అడ్డంకులు ఎదురవడంతో అసలు బాగోతం నిలిచిపోయినట్లు సమాచారం.

### ప్రొసీడింగ్స్ లేకుండా బిల్లులా?

మున్సిపల్ సంస్థలో ఏదైనా అభివృద్ధి పనిని చేపట్టాలంటే పరిపాలనా అనుమతులు, సాంకేతిక అనుమతులు, పనుల ప్రొసీడింగ్స్ తదితర ప్రక్రియలు తప్పనిసరి. పనులు పూర్తయిన తర్వాత కొలతలు నమోదు చేసి, సంబంధిత అధికారుల ధ్రువీకరణతోనే బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే పార్కుల వ్యవహారంలో అసలు ప్రొసీడింగ్స్ లేకుండానే పనులు చేసినట్లు రికార్డులు సృష్టించేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలు ఇప్పుడు కలకలం రేపుతున్నాయి. ఇదే నిజమైతే.. ఒకటి రెండు అధికారుల నిర్ణయంతో మాత్రమే ఇది సాధ్యమయ్యే వ్యవహారం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఫైలు ఏయే దశల్లో కదిలింది? ఎవరు పరిశీలించారు? ఎవరు ఆమోదించారు? బిల్లులు తయారయ్యాయా? చెల్లింపులు జరిగాయా? అన్నది తేలాల్సి ఉంది.

### కమీషన్ ముందే.. బిల్లు తర్వాత?

కాంట్రాక్టర్లకు ముందుగానే కమీషన్ నిర్ణయించి, ఆ తర్వాత బిల్లులు ఇప్పిస్తామంటూ ఆశ చూపడం బల్దియాలో కొందరు అధికారుల అవినీతి తీరుకు నిదర్శనమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పని విలువ కంటే బిల్లులో ఎంత మొత్తం వస్తుంది? అందులో ఎవరి వాటా ఎంత? అన్న లెక్కలతో వ్యవహారం నడుస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ముందస్తుగా రూ.5 లక్షలు ఇచ్చిన కాంట్రాక్టర్ ఇటీవలే ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించేలా సెటిల్‌మెంట్ జరిగినట్లు బల్దియా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. ఈ బాగోతానికి సంబంధించిన ఫైలు అప్పట్లో విచారణాధికారుల దృష్టికి వెళ్లకుండా దాచిపెట్టారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. నిజంగానే అలాంటి ఫైలు ఉంటే.. అది ప్రస్తుతం ఎక్కడుంది? దాన్ని ఎవరు నిర్వహించారు? విచారణకు ఎందుకు సమర్పించలేదు? అన్నది తేలాల్సి ఉంది. అప్పటి ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసిన అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లు ఎవరు? పార్కుల పనులకు ఎంత మొత్తంలో అంచనాలు రూపొందించారు? అసలు పనులు జరిగాయా? జరిగితే కొలతలు ఎవరు నమోదు చేశారు? బిల్లులు ఎవరు రూపొందించారు? చెల్లింపులు జరిగాయా? అన్న వివరాలను బయటకు తీస్తే అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### విచారణ జరిగితేనే వాస్తవాలు

కొన్నేళ్ల క్రితం జరిగినట్లు చెబుతున్న ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని బల్దియా వర్గాల్లో డిమాండ్ వినిపిస్తోంది. సంబంధిత ఫైళ్లు, ఎంబీలు, వర్క్ ఆర్డర్లు, ప్రొసీడింగ్స్, బిల్లులు, చెల్లింపు వివరాలు, అధికారుల నోట్ ఫైళ్లను పరిశీలిస్తే ఆరోపణల్లో వాస్తవమెంత అనేది తేలిపోతుంది. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు ప్రభుత్వ నిధుల రికవరీకి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే బల్దియాలో బిల్లుల చెల్లింపులపై అనేక ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో.. పాత ఫైళ్లను కూడా వెలికితీసి పరిశీలించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లేదంటే "పని చేయకుండానే బిల్లు.. బిల్లు చేయకముందే కమీషన్" అన్న ఆరోపణలు మరింత బలపడే అవకాశం ఉంది.

## కొండా ఫ్యామిలీకి రేవూరిని విమర్శించే హక్కులేదు

**సుస్మిత వ్యాఖ్యలను ఖండించిన గీసుగొండ మండల అధ్యక్షుడు శివ**



కాకతీయ, గీసుగొండ : పరకాల నియోజకవర్గాన్ని వదిలి వెళ్లిన కొండా సుస్మితకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దాడి శివ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరిపై సుస్మిత చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం గీసుగొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం, ఎమ్మెల్యే నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. వాటిని చూసి ఓర్వలేకే సుస్మిత అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజల కోసం పనిచేస్తున్న నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. సుస్మిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, ఆమెపై పార్టీ అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడంతో పాటు పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య, డీసీసీ ప్రధాన కార్యదర్శి తుమ్మనపల్లి శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ ఆకుల రుద్రప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోరిపల్లి పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ బహుకరణ



కాకతీయ, పెద్దవంగర: విద్యార్థులు చదువుకుంటేనే బంగారు భవిష్యత్తును నిర్మించుకోవచ్చని కోరిపల్లి గ్రామ సర్పంచ్ రంగు మురళిగౌడ్ అన్నారు. శనివారం కోరిపల్లి ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్‌తో పాటు నేమ్ బోర్డును బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు నిర్మాణమవుతుందని, చదువుతోనే జీవితాల్లో మార్పు సాధ్యమవుతుందన్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వాటర్ ప్యూరిఫైయర్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ, ఉపాధ్యాయులు అరుణ, రాజు, మల్లేశం, రవి, ఉపసర్పంచ్ మంజుల, వార్డు సభ్యులు వెంకన్న, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## తండాల అభివృద్ధికి మంత్రి కొండా ప్రత్యేక చొరవ

- గీసుగొండ తండాలకు రూ.7.01 కోట్ల నిధులు
- సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్లకు కేటాయింపు
- కాంగ్రెస్ నాయకుడు రడం భరత్‌కుమార్



కాకతీయ, గీసుగొండ : గీసుగొండ మండలంలోని గిరిజన తండాల అభివృద్ధికి మంత్రి కొండా సురేఖ ప్రత్యేక చొరవ తీసుకుని రూ.7,01,04,000 నిధులు మంజూరు చేయించారని కాంగ్రెస్ నాయకుడు రడం భరత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం జీవో జారీ చేసిందని చెప్పారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తండాల్లో మౌలిక వసతుల కల్పనపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. మంజూరైన నిధుల్లో సీసీ రోడ్లకు రూ.5,73,74,000, సీసీ డ్రైనేజీలకు రూ.82,30,000, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.45 లక్షలు కేటాయించినట్లు వివరించారు. నిధులతో తండాల్లో మౌలిక వసతులు మెరుగుపడి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. గిరిజనులపై ఉన్న అభిమానంతో మంత్రి కొండా సురేఖ తండాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారని, ఇందుకు గీసుగొండ మండల ప్రజలు, గిరిజన తండాల నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలుపుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కమల బిక్షపతి, అమృత బిక్షపతి, రాఘవేంద్ర, పేర్ల శ్రావణ్‌తో పాటు గిరిజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొండా సురేఖ స్థానంలో ఆది శ్రీనివాస్‌కే మంత్రి పదవా..?

**కుమార్తె వ్యాఖ్యలతో కొండా సురేఖకు రాజకీయ చిక్కులు**
**చర్యలపై కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయంపై ఉత్కంఠ**
**ప్రత్యామ్నాయంగా ఆది శ్రీనివాస్ పేరు తెరపైకి**
**మున్నూరు కాపు వర్గానికి మంత్రి పదవి దక్కేనా?**
**అధిష్ఠానం నిర్ణయమే తుది ఫలితాన్ని తేల్చనుంది**



కాకతీయ, వేములవాడ: మంత్రి కొండా సురేఖ వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఆమె కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీ అంతర్గతంగా అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ వ్యవహారంపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ వివరణ కోరగా.. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతమైనవేనని కొండా సురేఖ వివరణ ఇచ్చినట్లు సమాచారం. అయినప్పటికీ అధిష్ఠానం తదుపరి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తప్పిస్తే.. ఆమె స్థానంలో ఎవరికి అవకాశం దక్కుతుందన్న చర్చ కూడా మొదలైంది. కొండా సురేఖ స్థానంలో కొత్తగా ఎవరిని మంత్రి వర్గంలోకి తీసుకుంటారన్న చర్చలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేరు వినిపిస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు మంత్రివర్గంలో అవకాశం కల్పించవచ్చన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. పార్టీ అధిష్ఠానం, ప్రభుత్వ పెద్దలతో సత్సంబంధాలు ఉన్న నేతగా ఆయనకు ప్రాధాన్యం ఉందని అనుచరులు పేర్కొంటున్నారు. మంత్రివర్గంలో మార్పులు చోటుచేసుకుంటే ప్రాంతీయ, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందన్న చర్చ నేపథ్యంలో ఆది శ్రీనివాస్ పేరు తెరపైకి రావడం ఆసక్తికరంగా మారింది. అయితే ఈ ప్రచారంపై కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

### మున్నూరు కాపు కోటాలో అవకాశం?

మంత్రివర్గంలో మున్నూరు కాపు సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్ కూడా కొంతకాలంగా రాజకీయ చర్చల్లో ఉంది. ఈ నేపథ్యంలో అదే సామాజిక వర్గానికి చెందిన ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇస్తే సామాజిక సమీకరణాల పరంగా పార్టీకి ప్రయోజనం ఉంటుందన్న వాదన వినిపిస్తోంది. ప్రస్తుతం ఆయన వేములవాడ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతుండటంతో పాటు ప్రభుత్వ విప్‌గా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉత్తర తెలంగాణలో పార్టీ బలోపేతం, సామాజిక సమీకరణాలు, మంత్రివర్గంలో ప్రాంతీయ ప్రాతినిధ్యం వంటి అంశాలను అధిష్ఠానం పరిగణనలోకి తీసుకుంటే ఆయనకు అవకాశం ఉండొచ్చన్న ప్రచారం ఊపందుకుంది. కొండా సురేఖపై పార్టీ క్రమశిక్షణ కమిటీ వివరణ కోరడం, ఆమె కుమార్తె వ్యాఖ్యలపై కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరగడంతో తదుపరి చర్యలపై ఆసక్తి నెలకొంది. అయితే ప్రస్తుతం ఆమెను మంత్రి పదవి నుంచి తప్పిస్తారనే విషయానికి అధికారిక ధ్రువీకరణ లేదు. అలాగే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై కూడా ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనకు సంబంధం లేదని సురేఖ ఇప్పటికే వివరణ ఇచ్చిన నేపథ్యంలో అధిష్ఠానం దీనిని ఎలా పరిగణిస్తుంది? పార్టీ క్రమశిక్షణ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? అన్నది కీలకంగా మారింది.

### మార్పులు జరిగితేనే స్పష్టత

ఒకవేళ కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించాలని అధిష్ఠానం నిర్ణయిస్తే.. ఆమె స్థానాన్ని భర్తీ చేసే వ్యక్తి ఎంపికలో సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు కీలకంగా మారే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే ఆది శ్రీనివాస్ పేరు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే ఇప్పటివరకు ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఖరారైనట్లు ఎలాంటి అధికారిక సమాచారం లేదు. కొండా సురేఖపై అధిష్ఠానం తీసుకునే నిర్ణయం, దాని తర్వాత మంత్రివర్గంలో మార్పులపై సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ పెద్దల వైఖరిపైనే తదుపరి పరిణామాలు ఆధారపడి ఉంటాయి. దీంతో కొండా సురేఖ వ్యవహారం ఎటు తిరుగుతుంది? ఒకవేళ మార్పు జరిగితే ఆది శ్రీనివాస్‌కు అవకాశం దక్కుతుందా? మున్నూరు కాపు సామాజిక వర్గానికి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లభిస్తుందా? అన్నది ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో ఆసక్తికర చర్చగా మారింది.

## యూరియా, కాంప్లెక్స్ ఎరువులు ఎమ్మార్పీ ధరకే విక్రయించాలి

**తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో**




కాకతీయ,చేర్యాల : యూరియా, కాంప్లెక్స్ ఎరువులను ఎమ్మార్పీ ధరలకే రైతులకు విక్రయించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం చేర్యాల వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ రజినికి రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియా కొరతను ఆసరాగా చేసుకుని ఎమ్మార్పీ రూ.267 ఉన్న యూరియాను రూ.350 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. అదనంగా ఇతర పురుగుమందులు, గుళికలు కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామని రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు.ఫర్టిలైజర్ షాపులను అధికారులు తనిఖీ చేసి, ప్రతి విక్రయానికి బిల్లులు ఇవ్వడంతో పాటు స్టాక్, ధరల పట్టికను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రైతులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం పట్టణ కార్యదర్శి తుప్పతి రాజు, మండల సహాయ కార్యదర్శి నంగి మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

## 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

**ముగ్గురిపై కేసు నమోదు**



కాకతీయ, తుంగతుర్తి : ప్రభుత్వం పేదలకు సరఫరా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి తరలిస్తున్న ముగ్గురిపై నూతన్‌కల్ పోలీసులు కేసు నమోదు చేశారు. సుమారు 25 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఆత్మకూర్(ఎస్) మండలం రామన్నగూడెంకు చెందిన చలమల వీరస్వామి, ఆయన కుమారుడు చలమల లెనిన్, మిర్యాల గ్రామానికి చెందిన పీడీఎస్ బియ్యం డీలర్ కృష్ణారెడ్డి వద్ద నుంచి కిలో రూ.15 చొప్పున బియ్యాన్ని కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం అశోక్ లేలాండ్ మినీ గూడ్స్ వాహనం (టీఎస్07–యూజే–0634)లో మామిళ్లమడవ గ్రామ శివారులోని కోళ్లఫారానికి తరలిస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో మిర్యాల గ్రామ శివారులో వాహనాన్ని తనిఖీ చేసిన పోలీసులు 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, విక్రయించడం, తరలించడంవంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

## భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

- సేకరిస్తున్న భూముల్లో పెగ్ మార్కింగ్ త్వరగా పూర్తి చేయాలి
- రైతులకు పరిహారం చెల్లింపుల్లో జాప్యం వద్దు
- భూభారతి దరఖాస్తులు, రీసర్వేను వేగవంతం చేయాలి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

కాకతీయ, హన్మకొండ : గౌరవెల్లి కాలువ ప్రాజెక్టు, గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి, దేవాదుల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లింపుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో భూసేకరణ, అవార్డుల చెల్లింపులపై సమీక్ష నిర్వహించారు. గౌరవెల్లి ప్రాజెక్టు కోసం వేలేరు, భీమదేవరపల్లి, ధర్మసాగర్ మండలాల్లో చేపట్టిన భూసేకరణ, పెగ్ మార్కింగ్, పరిహారం చెల్లింపుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. పరకాల నియోజకవర్గంలోని గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి భూసేకరణపై వివరాలు తెలుసుకున్నారు. భూసేకరణలో భాగంగా పెగ్ మార్కింగ్‌ను లైసెన్స్‌డ్ సర్వేయర్లతో త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ పరిహారం చెల్లింపులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆర్వోబీల భూసేకరణను కూడా వేగవంతం చేయాలన్నారు. భూభారతి పోర్టల్‌లోని దరఖాస్తులను త్వరగా పరిష్కరించి, రీసర్వే ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

## ఎస్సారెస్పీ కాలువలతో రైతులను ఆదుకోవాలి

- తుంగతుర్తి ప్రాంతానికి నీటిని విడుదల చేయాలి
- వర్షాభావంతో ఎండుతున్న వరి పంటలు
- చెరువులు నింపి భూగర్భ జలాలను పెంచాలి
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు



కాకతీయ, తుంగతుర్తి : ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీటిని విడుదల చేసి తుంగతుర్తి ప్రాంత రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు డిమాండ్ చేశారు. తుంగతుర్తిలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాభావంతో తుంగతుర్తి ప్రాంతంలో రైతులు సాగు చేసిన వరి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సారెస్పీ గోదావరి జలాలతో నిండి ఉన్నందున కాలువల ద్వారా నీటిని విడుదల చేసి చెరువులను నింపాలని కోరారు. భూగర్భ జలాలు అడుగంటిన పరిస్థితుల్లో చెరువులు నిండితే బావులు, బోర్లలో నీటి లభ్యత పెరిగి పంటలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఇప్పటికే యూరియా కొరత, ఎరువుల ధరల పెరుగుదలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వీడి రైతుల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. అర్హులైన వారికి పింఛన్లు, రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను రాజకీయాలకు అతీతంగా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తుంగతుర్తి మండలంలోని అధ్వానంగా మారిన లింకు రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాసు, పులుసు సత్యం, మండల కార్యదర్శులు దేవరకొండ యాదగిరి, జి.ఉప్పలయ్య పాల్గొన్నారు.

## రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిరంతర నిఘా

- నేరం తర్వాత దర్యాప్తు కంటే ముందస్తు చర్యలే కీలకం
- డ్రగ్స్ విక్రయాలు, సరఫరాపై ఉక్కుపాదం
- సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించాలి
- పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత




కాకతీయ, వరంగల్ బ్యూరో : నేరం జరిగిన తర్వాత దర్యాప్తు చేయడం కంటే ముందస్తు చర్యలతో నేరాలను అడ్డుకోవడమే కీలకమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనరేట్ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించిన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ వారి సమస్యలపై తక్షణమే స్పందించాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం, విక్రయాలు, సరఫరా మార్గాలపై పక్కా సమాచారం సేకరించి కట్టడి చేయాలని ఆదేశించారు. యువతకు మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాలపై విద్యార్థులు, యువత, వృద్ధులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనుమానాస్పద ఫోన్‌కాల్స్, లింకులు, ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండేలా ప్రచారం చేయాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సకాలంలో న్యాయం అందించాలని ఆదేశించారు. సమావేశంలో డీసీపీలు అంకిత్‌కుమార్, దారా కవిత, రాజమహేంద్ర నాయక్, కిషన్‌సింగ్, అదనపు డీసీపీలు సురేష్‌కుమార్, బాలస్వామి, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భూసేకరణ బాధితులకు న్యాయం చేస్తాం

- రైతులకు పూర్తిస్థాయి పరిహారం
- కాలువ నిర్మాణంతో సాగునీటి సౌకర్యం
- రైతుల ప్రయోజనాలు కాపాడటమే లక్ష్యం
- గ్రామసభలో ఆర్డీవో టి.సుమ




కాకతీయ, రాయపర్తి : దేవాదుల ఎత్తిపోతల పథకం (జేసీఆర్ డీఎల్ఐఎస్)లో భాగంగా నక్కల్ కెనాల్ కాలువ డిస్ట్రిబ్యూటరీల నిర్మాణానికి భూములు కోల్పోతున్న రైతులు, బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని ఆర్డీవో టి.సుమ స్పష్టం చేశారు. శనివారం కొలనుపల్లి, కేశవపురం, బురాన్‌పల్లి గ్రామాల్లో కాలువ నిర్మాణంపై నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఆమె మాట్లాడారు. కాలువ నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు నిబంధనల ప్రకారం తగిన పరిహారం అందిస్తామని తెలిపారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. సాగునీటి ప్రాజెక్టుల ద్వారా పంటలకు నీరు అందడంతోపాటు ప్రాంత అభివృద్ధికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులు, బాధితులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, నవాబ్ తహసీల్దార్ త్రినాథ్, సర్పంచులు వంగాల ఎల్లమ్మ, సూదుల ఉమాదేవి, గుజె సుధాకర్, ఆర్ఐ చంద్రమోహన్, జీపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విధుల్లో ప్రతిభకు కానిస్టేబుల్ కరుణాకర్‌కు ప్రశంస



కాకతీయ,కొమురవెల్లి: పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ప్రతిభ కనబరిచి, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ (రైటర్) టి. కరుణాకర్ అధికారుల ప్రశంసలు అందుకున్నారు.తనకు అప్పగించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తూ, ప్రజలకు సేవలందించడంలో తనదైన శైలిని చాటుకున్న కరుణాకర్‌ను పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాల్ అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ చేతుల మీదుగా నగదు బహుమతి, ప్రశంస పత్రంఅందుకున్నారు. ఈ గుర్తింపు తనకు మరింత బాధ్యతను పెంచిందని కరుణాకర్ తెలిపారు. తనను ప్రోత్సహించిన అధికారులు, సహచర సిబ్బంది, శ్రేయోభిలాషులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజలకు చేరువయ్యేలా విధులు నిర్వహించాలి

- పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి
- దొంగతనాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ
- ఎస్పీ మహేష్ బి.గితే



కాకతీయ, గంభీరావుపేట: విధుల నిర్వహణ, పనితీరు మెరుగుపర్చడం ద్వారా పోలీసులు ప్రజలకు మరింత చేరువ కావాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. శనివారం గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన కేసులు, పెండింగ్ దర్యాప్తులు, రికార్డులు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. కేసుల దర్యాప్తులో శాస్త్రీయ పద్ధతులు, ఆధునిక సాంకేతికతను వినియోగించాలని సూచించారు. దొంగతనాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, రికవరీ శాతం పెంచాలని ఆదేశించారు. గ్రామాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేసి, డయల్ 112కు సమాచారం అందిన వెంటనే బాధితులకు సహాయం అందించాలన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేష్, ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల దీక్షలకు మద్దతు

కాకతీయ, కారేపల్లి : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 24, 25 తేదీల్లో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న 48 గంటల దీక్షలకు మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధ సింగరేణి మండల కమిటీ నాయకులు తెలిపారు. శనివారం ఎంపీవో రవీంద్ర ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ కే. నరేంద్ర మాట్లాడుతూ జీవో 51లోని మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, రెండో పీఆర్సీలో కార్మికులను గుర్తించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం అమలు చేసి, వేతనాలను నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, అక్రమ తొలగింపులను అరికట్టాలని అన్నారు. దీక్షలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్. నాగేశ్వరరావు, బొల్లకొమరయ్య, ఆధర్ల గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు సహించేది లేదు

- కొండా సుష్మిత బహిరంగ క్షమాపణ చెప్పాలి
- విమర్శలకు హద్దులు ఉండాలి : ఎమ్మెల్యే రాందాస్ నాయక్



కాకతీయ, కారేపల్లి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కొండా సుష్మిత చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తెలిపారు. అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిని వ్యక్తిగతంగా కించపరిచేలా మాట్లాడటం సరైన రాజకీయ సంస్కృతి కాదన్నారు. కొండా సుష్మిత వెంటనే వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాలను విమర్శించే హక్కు ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలకు పాల్పడటం సరికాదన్నారు. సీఎం అమెరికా పర్యటనను అడ్డుకునే ప్రయత్నాలు రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల సాధన కోసం సీఎం పర్యటనలు చేపడుతున్నారని, వాటికి ఆటంకం కలిగించడం తెలంగాణ ప్రయోజనాలకు నష్టమన్నారు. కార్యక్రమంలో తోటకూరి రాంబాబు, అడ్డగూడ ఐలయ్య, టోనీ పాల్గొన్నారు.

## ప్రేరణ కార్యక్రమంలో ప్రతిభకు గుర్తింపు

- ప్రధానమంత్రి ప్రశంసలు పొందిన విద్యార్థి దీక్షిత్
- విద్యార్థిని సత్కరించిన పాఠశాల యాజమాన్యం



కాకతీయ, నెల్లికుదురు : ప్రేరణ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నుంచి ప్రశంసా పత్రం అందుకున్న సింగారం దీక్షిత్‌ను ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపేందర్‌రావు శనివారం సత్కరించారు. పదో తరగతి చదువుతున్న దీక్షిత్ గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని వివిధ పోటీల్లో ప్రతిభ చాటినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల విద్యార్థులతో కలిసి విలువైన అనుభవాలు పొందాడన్నారు. ప్రధాని ప్రశంసలు అందుకోవడం పాఠశాల, తల్లిదండ్రులకు గర్వకారణమన్నారు. విద్యార్థికి మార్గదర్శకత్వం అందించిన ఉపాధ్యాయులు అంజుమ్ సుల్తానా, టి. సతీష్‌లను కూడా సత్కరించారు. దీక్షిత్ మాట్లాడుతూ తన విజయానికి గైడ్ టీచర్ల ప్రోత్సాహమే కారణమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యుగంధర్, నాగమోహన్, నవీన్‌కుమార్, సక్రాం, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.